E69 NEWS

# తెలుగు గళం

సామాన్యుల గుండె చప్పుడు జాతీయ తెలుగు దినపత్రిక

విలేకరులు కావలెను

E69 NEWS ,తెలుగు గళం దినపత్రికలో

పని చేయుటకు నియోజకవర్గాలవారీగా

విలేకరులు కావలెను వాట్సాప్ నెం:

9959812941-9949356387

PUBLISHED: JANGAON,HYDERABAD సంపుటి :01 సంచిక :235 మంగళవారం 04 ఆగస్టు 2026 ఎడిటర్: రాయపర్తి భాను ప్రసాద్ పేజీలు: 04 వెల :05/-

## రెండేళ్లలో భారీ అప్పులు



2 లో

రూ. 1.69 లక్షల కోట్లు

పార్లమెంట్‌లో కేంద్రం వెల్లడి

మార్కెట్ నుంచే అధిక రుణాలు

ఎఫ్ఆర్‌బీఎం నిబంధనల ప్రస్తావన

అప్పులు రాష్ట్ర బాధ్యతే

## ఉద్యోగ హామీలు ఎక్కడ?

రేవంత్‌పై కేటీఆర్ విమర్శలు

విద్యార్హతపై కేటీఆర్ సందేహం

నిరుద్యోగులపై కాంగ్రెస్ ఫెయిల్

యూత్ డిక్లరేషన్ అమలేదే?

రాహుల్‌కూ కేటీఆర్ ప్రశ్నలు

రెండు లక్షల ఉద్యోగాల డిమాండ్



**న్యూస్ డెస్క్, 03 ఆగస్టు (తెలుగు గళం):** కాంగ్రెస్ ప్రభుత్వ బాధ్యతారాహిత్యం, నెరవేర్చని హామీల వల్ల తెలంగాణలో నిరుద్యోగులు తీవ్ర ఆందోళన చెందుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, మాజీ మంత్రి కేటీఆర్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీలపై విమర్శలు గుప్పించారు. ఎన్నికల సమయంలో 'యూత్ డిక్లరేషన్' పేరిట కాంగ్రెస్ ఊదరగొట్టిందని కేటీఆర్ మండిపడ్డారు. అసెంబ్లీ సాక్షిగా జాబ్ క్యాలెండర్ విడుదల చేసి రెండేళ్లు కావస్తున్నా ఇంతవరకు ఉద్యోగాల భర్తీ చేపట్టలేదని దుయ్యబట్టారు. ఉద్యోగాలు రాకపోవడంతో తీవ్ర మనస్థాపానికి గురై ఒక యువకుడు ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రంలో 20 వేల పోలీసు ఉద్యోగాలు ఖాళీగా ఉంటే, కేవలం 7 వేల పోస్టులకు మాత్రమే నోటిఫికేషన్ ఇవ్వడం నిరుద్యోగులను మోసం చేయడమేనని స్పష్టం చేశారు.

**నోటిఫికేషన్లు అడిగితే ఎండ్రిన్ తాగమంటారా?**

"హైదరాబాద్లోని అశోక్ నగర్ నడిబొడ్డున రాహుల్ గాంధీ నిరుద్యోగులకు ఇచ్చిన హామీలు ఏమయ్యాయి?" అని కేటీఆర్ ప్రశ్నించారు.

2 లో

## కేబినెట్ షాక్‌తో

### కాంగ్రెస్‌లో తిరుగుబాటు

మంత్రి పదవి రాక ఇద్దరు ఎమ్మెల్యేల రాజీనామా

చివరి నిమిషంలో జాబితా మారిందన్న ఆరోపణ

విధేయతకు విలువ లేదంటూ పాటిల్ ఆవేదన

మద్దతుదారుల నిరసనతో బెంగళూరులో ఉద్రిక్తత

పార్టీ మారను.. ఆత్మగౌరవమే ముఖ్యమన్న ఎమ్మెల్యే

కేబినెట్ విస్తరణతో కాంగ్రెస్‌లో అంతర్గత సంక్షోభం

అసంతృప్త నేతలతో డీకే సర్కార్‌కు కొత్త తలనొప్పి

2 లో

## అసెంబ్లీకి కొత్త రూపు


రెండు అంతస్తుల ప్రతిపాదన

కొత్త చాంబర్లకు రూపకల్పన

భవన సామర్థ్యంపై పరీక్షలు

కానిస్టిట్యూషన్ క్లబ్ నిర్మాణం

స్పీకర్‌కు అధికారిక నివాసం



2 లో

**న్యూస్ డెస్క్, 03 ఆగస్టు (తెలుగు గళం):** అసెంబ్లీ భవనంలో మరిన్ని వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నారు. అసెంబ్లీ భవన విస్తరణపై మాస్టర్ ప్లాన్ తయారు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీలకు అనువుగా నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు. కొద్ది కాలం క్రితం అసెంబ్లీ, శాసనమండలి ఒకే ప్రాంగణం నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. దీంతో స్పీకర్, చైర్మన్, మంత్రులు, చీఫ్ విప్‌లు, విప్‌లకు చాంబర్లకు ఇబ్బందిగా మారింది. మంత్రుల చాంబర్లు ఇరుకుగా ఉన్నాయని, వీటిని మరికొంత విస్తరించాలని నిర్ణయించారు.



## కన్నకూతుళ్ల చేతిలోనే

## వృద్ధ దంపతులకు అన్యాయం...?

- లింగమూరి గూడెం ఘటన-ఆస్తి కోసం మాయమాటలు, రిజిస్ట్రేషన్ నిలిపిన తహసీల్దార్

**తెలుగు గళం న్యూస్ ఐనవోలు, / ఆగస్టు 03**

హన్మకొండ జిల్లా అయినవోలు మండలం లింగమూరి గూడెం గ్రామంలో చోటుచేసుకున్న భూ వివాదం కుటుంబ బంధాలు, ఆస్తి వ్యవహారాలు ఎంతటి విషాదానికి దారితీస్తాయో మరోసారి రుజువు చేసింది. జీవితాంతం కష్టపడి సంపాదించిన ఆస్తి చివరికి కన్న కూతుళ్ల చేతుల్లోనే వివాదానికి కేంద్రబిందువు కావడం స్థానికంగా చర్చనీయాంశమైంది.వృద్ధ దంపతుల ఆరోపణలు గ్రామానికి చెందిన గజ్జెల్లి సమ్మయ్య, భద్రమ్మ దంపతులకు సునీత, సుకన్య, వాణిశ్రీ, సుజాత,శ్రీలత అనే ఐదుగురు కుమార్తెలు, గజ్జెల్లి రాజు అనే కుమారుడు ఉన్నారు. 2018లో కుమారుడు రాజు అనారోగ్యంతో మరణించాడు. ఒక్కగానొక్క వారసుడు లేని పరిస్థితిని ఆసరాగా చేసుకున్న కుమార్తెలు," మేమే మిమ్మల్ని సాదుతాం"అని మాయమాటలు చెప్పి వృద్ధ దంపతులను తీసుకెళ్లారని ఆరోపిస్తున్నారు. రైతు బీమా పేరుతో 2020లో 3 ఎకరాల 15 గుంటల వ్యవసాయ భూమిలో తలా 20 గుంటల చొప్పున తమ పేర్లపై రిజిస్ట్రేషన్లు చేయించుకున్నారని వాపోతున్నారు. ఇన్నాళ్లు "కౌలుకు చేస్తున్నాం" అని నమ్మించి,ఇప్పుడు వరంగల్‌కు చెందిన రియల్ ఎస్టేట్ వ్యాపారులకు తక్కువ ధరకు భూమిని విక్రయించి సుమారు 8 లక్షల రూపాయలకు అమ్మేందుకు ప్రయత్నిస్తున్నారని వృద్ధ దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ జోక్యంతో రిజిస్ట్రేషన్ నిలిపివేత

గత వారం స్లాట్ బుక్ చేసుకున్న కుమార్తెలు సోమవారం ఐనవోలు తహసీల్దార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ చేయించేందుకు వచ్చారు. విషయం తెలుసుకున్న వృద్ధ దంపతులు వెంటనే కార్యాలయానికి చేరుకుని రిజిస్ట్రేషన్ నిలిపివేయాలని వేడుకున్నారు. వారి విన్నపాన్ని పరిగణలోకి తీసుకున్న తహసీల్దార్ విక్రమ్ కుమార్ వివాదం ఉన్న నేపథ్యంలో రిజిస్ట్రేషన్‌ను తక్షణమే నిలిపివేశారు. సీనియర్ సిటిజన్ ఆక్ట్ ప్రకారం తదుపరి విచారణ కోసం విషయాన్ని ఆర్డీఓకు పంపించారు.

## హైడ్రా తరహాలో మరో సంస్థ



**న్యూస్ డెస్క్, 03 ఆగస్టు (తెలుగు గళం):** రాష్ట్రంలో హైడ్రా తరహాలో టీజీ సేఫ్ (Telangana Safety Authority of Food And Essential Drugs)పేరుతో కొత్త సంస్థ ఏర్పాటు చేసే పనిలో ప్రభుత్వం ఉంది. ఆ సంస్థ హోటల్స్, ఫుడ్ కోర్టులు, రెస్టారెంట్స్‌లో వినియోగదారులకు సరఫరా చేసే ఆహార పదార్థాలతో పాటు మెడికల్ షాపుల్లో ప్రజలకు విక్రయించే మందులను తనిఖీ చేయనున్నది. అందుకోసం ఇప్పటివరకు విడివిడిగా ఉన్న ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ సంస్థలను విలీనం చేయనున్నారు. అలాగే ఐజీ ర్యాంకు అధికారిని నియమించడం, కావాల్సిన ఫీల్డ్ స్టాఫ్‌ను సమకూర్చేందుకు కసరత్తు చేస్తున్నారు. సంస్థ ఏర్పాటుపై లీగల్ ప్రాబ్లమ్స్ రాకుండా ఉండేందుకు కావాల్సిన చట్ట సవరణలు చేసే పనిలో అధికారులు ఉన్నారు.

ప్రజా ఆరోగ్యంపై ఫోకస్

ఈ మధ్య వివిధ శాఖల్లోని విజిలెన్స్ విభాగాల పనితీరుపై సీఎం సమీక్ష చేసిన సమయంలో ఖరీదైన హోటల్స్, రెస్టారెంట్స్, పబ్స్‌లో అందిస్తోన్న ఆహారంపై చర్చ జరిగింది.

మిగతాది 2 లో..

హోటళ్లపై ఇక సేఫ్ నిఘా

ఆహారం-మందులపై ఒకే అథారిటీ

కల్తీపై కఠిన కంట్రోల్

ప్రజారోగ్యమే ప్రధాన లక్ష్యం

ఫుడ్, డ్రగ్స్ విభాగాల విలీనం

ఐజీ స్థాయి అధికారికి బాధ్యతలు

రెగ్యులర్ తనిఖీలకు ప్రత్యేక బృందం

కల్తీకి చెక్.. నాణ్యతకు గ్రీన్ సిగ్నల్

## సుప్రీంకోర్టు విస్తరణకు పార్లమెంట్ ఆమోదం


38కి జడ్జిల బలం

లోక్‌సభ గ్రీన్ సిగ్నల్

కేసుల భారానికి చెక్

ఏడేళ్ల తర్వాత విస్తరణ

నలుగురు జడ్జిలకు దారి



**న్యూస్ డెస్క్, 03 ఆగస్టు (తెలుగు గళం):** దేశ అత్యున్నత న్యాయస్థానమైన సుప్రీంకోర్టులో పెరుగుతున్న కేసుల భారాన్ని తగ్గించి, బాధితులకు వేగంగా న్యాయం అందించేందుకు ఉద్దేశించిన కీలక బిల్లుకు పార్లమెంట్ లోక్‌సభ ఆమోదం తెలిపింది. బిల్లుపై చర్చను కేంద్ర మంత్రి అర్జున్ రామ్ మేఘవాల్ ఆరంభించారు.

2 లో

## అరెస్టులపై జగన్ ఆగ్రహం



2 లో

రాత్రి దాడులు పోలీసు రాజ్యానికి నిదర్శనమన్న జగన్

సాక్ష్యాల మాయం ప్రయత్నమా? అంటూ ప్రశ్న

మాజీ నేతలపై కేసుల నమోదుపై విమర్శలు

## 'జంతర్ మంతర్'కు గుడ్ బై

కొత్త వేదికపై కసరత్తు

సుప్రీంకోర్టు కీలక ఆదేశాలు

స్థానికుల ఇబ్బందులపై విచారణ

కేంద్రానికి నోటీసులు జారీ

కొత్త ధర్నా స్థలంపై చర్చ



2 లో

**న్యూస్ డెస్క్, 03 ఆగస్టు (తెలుగు గళం):** దేశ రాజధాని న్యూఢిల్లీలో ప్రధాన నిరసన వేదికగా ఉన్న జంతర్ మంతర్ వద్ద ధర్నాల వల్ల స్థానికులకు, రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదురవుతున్నాయని దాఖలైన పిటిషన్‌పై సుప్రీంకోర్టు విచారణ చేపట్టింది. జంతర్ మంతర్‌కు బదులుగా మరొక అనువైన ప్రత్యామ్నాయ ప్రదేశాన్ని కేటాయించే అంశంపై కేంద్ర ప్రభుత్వం నుంచి ఆదేశాలు పొందాలని సొలిసిటర్ జనరల్‌ను ఆదేశించింది.

## కేంద్ర ఉద్యోగులకు తీపికబురు




2 లో

ప్రస్తుతం 60% డీఏ.. 63%కు పెరిగే అవకాశం

ఏఐసీపీఐ సూచీ ఆధారంగా నిర్ణయం

కేంద్ర కేబినెట్ ఆమోదం కోసం ఎదురుచూపులు

ఉద్యోగులు, పెన్షనర్లకు భారీ ఊరట

జులై విడత డీఏ పెంపుపై కీలక అప్‌డేట్

ద్రవ్యోల్బణాన్ని దృష్టిలో ఉంచుకుని నిర్ణయం

కోటి మందికిపైగా లబ్ధిదారులకు ప్రయోజనం

# సుప్రీంకోర్టు విస్తరణకు పార్లమెంట్ ఆమోదం

మొదటి పేజీ తరువాయి

ఈ సందర్భంగా ప్రతిపక్ష సభ్యులు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కీలకమైన బిల్లుపై చర్చలో పాల్గొనాలని సభ్యులను స్పీకర్ వారిని రిక్వెస్ట్ చేయగా.. అయినా వినకపోవడంతో బిల్లుపై చర్చ లేకుండానే స్పీకర్ ఆమోదించారు. దీంతో సుప్రీంకోర్టులో ప్రధాన న్యాయమూర్తితో సహా మొత్తం న్యాయమూర్తుల సంఖ్యను 34 నుంచి 38కి పెంచే ప్రతిపాదనకు దిగువ సభ గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. అయితే, గతంలో 2019లో సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను సీజేఐతో కలిపి 31 నుంచి 34కి పెంచారు. ఆ తర్వాత దాదాపు ఏడేళ్ల విరామం అనంతరం మళ్లీ జడ్జిల సంఖ్యను పెంచుతూ కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది.

జడ్జీల సంఖ్య పెరిగింది ఇలా..

భారత రాజ్యాంగంలోని ఆర్టికల్ 124(1) ప్రకారం సుప్రీంకోర్టు న్యాయమూర్తుల సంఖ్యను సవరించడం.. పెంచే అధికారం కేవలం పార్లమెంటుకు మాత్రమే ఉంటుంది. 1950లో రాజ్యాంగం అమలుల్లోకి వచ్చినప్పుడు సీజేఐతో సహా మొత్తం 8 మంది జడ్జిలు మాత్రమే ఉండేవారు. ఆ తర్వాత 1956లో సంఖ్య 10కి, 1960లో 13కు, 1977లో 18కి, 1986లో 26కు, 2009లో 31కి, 2019లో 34కు, 2026లో ప్రస్తుతం సీజేఐతో కలిపి 37 మంది జడ్జిలు ఉన్నారు. అయితే, సుప్రీంకోర్టులో ప్రస్తుతం వేలాది రాజ్యాంగ, సివిల్, క్రిమినల్ పిటిషన్లు పెండింగ్‌లో ఉన్నాయి. రాజ్యాంగ ధర్మాసనాలు (Bench) సక్రమంగా నిర్వహించడానికీ, రోజువారీ విచారణలను వేగవంతం చేయడానికీ ఈదనంగా మరో నలుగురు న్యాయమూర్తుల నియామకం ఎంతో దోహదపడుతుందని న్యాయ నిపుణులు భావిస్తున్నారు.

# 'జంతర్ మంతర్'కు గుడ్ బై

మొదటి పేజీ తరువాయి

ప్రధాన న్యాయమూర్తి నేతృత్వంలోని జస్టిస్ జాయ్ మాల్య బాగ్చి, జస్టిస్ వి. మోహనలతో కూడిన త్రిసభ్య ధర్మాసనం ఈ పిటిషన్‌పై కేంద్ర ప్రభుత్వం సహా సంబంధిత వర్గాలకు నోటీసులు జారీ చేసింది.

పిటిషనర్ ప్రధాన వాదనలు..

సతీష్ చంద్ కౌశిక్ దాఖలు చేసిన ఈ పిటిషన్‌లో ప్రస్తుతం జంతర్ మంతర్ వద్ద నిరసనలకు అవసరమైన మురుగునీటి పారుదల, ఆహారం తదితర ప్రాథమిక సౌకర్యాలు లేవని పేర్కొన్నారు. ఈ ప్రాంతంలో ధర్నాలు జరగడం వల్ల స్థానిక నివాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, అత్యవసర వైద్య సేవలు, సరుకుల సరఫరాకు ఆటంకం కలుగుతోందనీ పిటిషనర్ కోర్టు దృష్టికి తీసుకెళ్లారు. నిరసనల సమయంలో ప్రాంతంలోకి రావడం, వెళ్లడం కష్టంగా మారుతోందని తెలిపారు.

కోర్టు వ్యాఖ్యలు..

విచారణ సందర్భంగా ప్రధాన న్యాయమూర్తి స్పందిస్తూ, "రాకపోకలు, అత్యవసర వైద్య సేవల సరఫరాకు సంబంధించి పిటిషన్‌లో లేవనెత్తిన అంశాలు ముఖ్యమైనవి. దీనిపై కేంద్ర ప్రభుత్వం నుంచి స్పష్టమైన సూచనలు తీసుకోండి అని సొలిసిటర్ జనరల్‌ను ఆదేశించారు. విచారణ సమయంలో రాజకీయ నాయకులు పిలుపునిచ్చిన ర్యాలీలు, గత సంఘటనలను పిటిషనర్ తరఫు న్యాయవాది ప్రస్తావించగా, రాజకీయ నిరసనలపై స్పందించేందుకు ధర్మాసనం నిరాకరించింది. ఆయా వ్యవహారాలను ఎలా సరిదిద్దాలో శాంతిభద్రతల యంత్రాంగానికి తెలుసని వ్యాఖ్యానించింది. ఈ కేసు విచారణను సుప్రీంకోర్టు వేరుగా విచారించేందుకు జాబితా చేసింది.

# కేబినెట్ షాక్‌తో కాంగ్రెస్‌లో తిరుగుబాటు



**న్యూస్ డెస్క్, 03 ఆగస్టు (తెలుగు గళం):** కర్ణాటక కాంగ్రెస్ ప్రభుత్వంలో తీవ్ర అసంతృప్తి జ్వాలలు భగ్గుమన్నాయి. రాష్ట్ర మంత్రివర్గ విస్తరణ వేళ పార్టీ అధిష్ఠానానికి ఊహించని షాక్ తగిలింది. కొత్త మంత్రుల ప్రమాణ స్వీకారానికి కొద్ది గంటల ముందు కేబినెట్‌లో చోటు దక్కలేదని తీవ్ర తీవ్ర అసంతృప్తికి గురైన ఇద్దరు కాంగ్రెస్ ఎమ్మెల్యేలు తమ శాసనసభ సభ్యత్వాలకు రాజీనామా చేశారు. ఇండి నియోజకవర్గ ఎమ్మెల్యే యశ్వంతరాయగౌడ వి. పాటిల్, సాగర్ నియోజకవర్గ ఎమ్మెల్యే బెళూరు గోపాలకృష్ణ తమ పదవులకు రాజీనామా చేస్తున్నట్లు ప్రకటించారు.

క్షణాల్లో మారిన జాబితా.. అసంతృప్తిలో నేతలు

ఎమ్మెల్యే యశ్వంతరాయగౌడ పాటిల్ విధాన సౌధలో డిప్యూటీ స్పీకర్ రుద్రప్ప లమాణిని కలసి తన రాజీనామా లేఖను సమర్పించారు. పాటిల్‌కు మంత్రివర్గంలో చోటు కల్పించకపోవడంపై ఆగ్రహం వ్యక్తం చేస్తూ ఆయన మద్దతుదారులు బెంగళూరులో భారీ నిరసన ప్రదర్శన చేపట్టారు. మరోవైపు సాగర్ ఎమ్మెల్యే బెళూరు గోపాలకృష్ణ కూడా అసెంబ్లీకి రాజీనామా చేయడంతో కాంగ్రెస్ నాయకత్వంపై తీవ్ర ఒత్తిడి పెరిగింది. రాజీనామా అనంతరం యశ్వంతరాయగౌడ పాటిల్ మీడియాతో మాట్లాడుతూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. "నేడు ఉదయం వరకు విడుదలైన జాబితాలో నా పేరు ఉంది, నాకు అధికారిక సమాచారం కూడా వచ్చింది. కానీ చివరి నిమిషంలో ప్రకటించిన ఆఖరి జాబితాలో నా పేరు కనిపించలేదు. పార్టీ అధిష్ఠానం ఇచ్చిన మాటను నిలబెట్టుకోవడంలో విఫలమైంది. విధిలేని పరిస్థితుల్లోనే రాజీనామా సమర్పించాను. కాంగ్రెస్ పార్టీలో విధేయతకు, నిజాయితీకి విలువ లేకుండా పోయింది."

పార్టీ మారట్లేదు కానీ ఆత్మగౌరవం ముఖ్యం

తాను పదవుల కోసం ఆరాటపడటం లేదని, 2023 అసెంబ్లీ ఎన్నికల కంటే ముందే తనకు మంత్రి పదవి ఇస్తామని హామీ ఇచ్చారని పాటిల్ గుర్తుచేశారు. "ప్రభుత్వం ఏర్పడిన సమయంలో రెండున్నరేళ్ల తర్వాత కేబినెట్‌లోకి తీసుకుంటామన్నారు, కానీ ఆ హామీని నిలబెట్టుకోలేదు. ఇప్పటివరకు 8 ఎన్నికలు ఎదుర్కొన్న పరిణతి చెందిన రాజకీయనాయకుడిని నేను. ఇది నా నియోజకవర్గ ప్రజలకు జరిగిన అవమానం. నేను పార్టీని వీడటం లేదు, కానీ రాజీనామా చేసే వాతావరణాన్ని వాళ్లే కల్పించారు" అని పేర్కొన్నారు.

కేబినెట్ విస్తరణ నేపథ్యం

డీకే శివకుమార్ ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన రెండు నెలల తర్వాత ఈ కేబినెట్ విస్తరణ చేపట్టారు. కొత్తగా కేబినెట్ లోకి తీసుకున్న 20 మంది మంత్రులు బెంగళూరులోని లోక్ భవన్‌లో సాయంత్రం 5 గంటలకు ప్రమాణస్వీకారం చేశారు. ఈ విస్తరణలో స్థానం దక్కని పలువురు సీనియర్ నేతలు తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. కొందరు కార్పొరేషన్ చైర్మన్ పదవులకు కూడా రాజీనామా చేసినట్లు తెలుస్తోంది. ఈ పరిణామాలు కర్ణాటక కాంగ్రెస్ సర్కారులో అంతర్గత కలహాలను మరింత తీవ్రతరం చేశాయి.

# కేంద్ర ఉద్యోగులకు తీపికబురు




**న్యూస్ డెస్క్, 03 ఆగస్టు (తెలుగు గళం):** కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు ఉత్కంఠగా ఎదురుచూస్తున్న 8వ పే కమిషన్ వేతన పెంపునకు సంబంధించి కీలక అప్‌డేట్ రానే వచ్చింది. ద్రవ్యోల్బణాన్ని తట్టుకునేందుకు కేంద్రం ప్రతి ఏటా రెండుసార్లు ఉద్యోగులకు కరువు భత్యం రూపంలో వేతన పెంపును అందిస్తోంది. అందులో భాగంగా జులై విడతకు సంబంధించిన డీఏ పెంపుపై త్వరలోనే అధికారిక ప్రకటన వెలువడే అవకాశం ఉంది. అయతే ఈ డీఏ పెంపును కార్మిక శాఖ విడుదల చేసే ఆలిండియా కన్జూమర్ ప్రైస్ ఇండెక్స్ ఫర్ ఇండస్ట్రియల్ వర్కర్స్ గణాంకాల ఆధారంగా కేంద్ర ప్రభుత్వం నిర్ణయిస్తుంది. ఈసారి వెలువడిన వినియోగదారుల ధరల సూచీ ఆధారంగా ఉద్యోగులకు 3 శాతం డీఏ పెరిగే అవకాశం కనిపిస్తోంది. ప్రస్తుతం కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు 60 శాతం డీఏను పొందుతున్నారు. ఇప్పుడు ప్రకటించబోయే 3 శాతం పెంపుతో డీఏ రేటు 60 శాతం నుంచి 63 శాతానికి చేరనుంది. కేంద్ర కేబినెట్ అధికారికంగా ఆమోదం తెలిపిన వెంటనే కొత్త వేతనాలు అమలుల్లోకి రానున్నాయి. తాజా నిర్ణయంతో దేశవ్యాప్తంగా ఉన్న కోటి మందికి పైగా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లకు ఆర్థికంగా ప్రయోజనం చేకూరనుంది.

# ఉద్యోగ హామీలు ఎక్కడ?

మొదటి పేజీ తరువాయి

2 లక్షల ఉద్యోగాలు భర్తీ చేస్తామని చెప్పి అధికారంలోకి వచ్చాక కనీసం 10 వేల పోస్టులు కూడా భర్తీ చేయలేదని ఆరోపించారు. నోటిఫికేషన్లు వేయాలని నిరుద్యోగులు డిమాండ్ చేస్తుంటే.. సీఎం రేవంత్ రెడ్డి బాధ్యతారాహిత్యంగా 'ఎండ్రిన్ తాగి చావండి' అని మాట్లాడటం దారుణమన్నారు. ఇంజినీరింగ్ గ్రాడ్యుయేట్లను 'క్రిమినల్ వేస్ట్' అని సంబోధించిన సీఎం రేవంత్ రెడ్డికే దేశంలో అత్యధిక క్రిమినల్ కేసులు ఉన్నాయని. ఆయనే అసలైన క్రిమినల్ వేస్ట్ అని కేటీఆర్ విమర్శించారు. ఢిల్లీలో రాజ్యాంగ ప్రతి పట్టుకుని తిరిగే రాహుల్ గాంధీకి తెలంగాణలో నిరుద్యోగులకు జరుగుతున్న అన్యాయం, సీఎం రేవంత్ రెడ్డి వ్యాఖ్యలు కనిపించడం లేదా అని నిలదీశారు. యూత్ డిక్లరేషన్‌లో ఇచ్చిన 24 హామీలలో ఒక్కటి కూడా నెరవేర్చలేదని కేటీఆర్ ధ్వజమెత్తారు.

రేవంత్ విద్యార్హతపై అనుమానాలు..

"రేవంత్ రెడ్డి అసలు ఏం చదివారో కూడా నాకు అనుమానంగానే ఉంది. ఎవరి సహాయం లేకుండా ఆయన తన ఎన్నికల అఫిడవిట్ నింపగలరా? కనీసం ఒక్క ఉద్యోగ ఇంటర్వ్యూ అయినా ఫేస్ చేశారా? అసలు విద్యార్థుల కష్టాలు, వారి శ్రమ రేవంత్ రెడ్డికి ఏం తెలుసు?" అని కేటీఆర్ వ్యాఖ్యానించారు. బీఆర్ఎస్ హయాంలో కరోనా సంక్షోభం వచ్చినా, కేంద్రం నుంచి నిధులు ఆగిపోయినా నిరుద్యోగుల కోసం 2 లక్షలకు పైగా ఉద్యోగాలు భర్తీ చేశామని గుర్తుచేశారు. ఇప్పటికైనా కాలయాపన చేయకుండా 2 లక్షల ఉద్యోగాలను ఎప్పుడు భర్తీ చేస్తారో సీఎం రేవంత్ రెడ్డి. రాహుల్ గాంధీ వెంటనే సమాధానం చెప్పాలని కేటీఆర్ డిమాండ్ చేశారు.

# బీజేపీ నాయకత్వానికి పీకే సూచనలు



**న్యూస్ డెస్క్, 03 ఆగస్టు (తెలుగు గళం):** బంకీపూర్ ఉప ఎన్నిక ఫలితంతో బిహార్ ప్రజలు బీజేపీ కేంద్ర నాయకత్వానికి స్పష్టమైన సందేశం ఇచ్చారని జన సురాజ్ పార్టీ నేత ప్రశాంత్ కిశోర్ అన్నారు. బిహార్ ముఖ్యమంత్రిగా మంచి వ్యక్తిని ఎంపిక చేయాలని, రాష్ట్ర అభివృద్ధి, ఉపాధి కల్పనకు ప్రాధాన్యత ఇవ్వాలని ఆయన కోరారు. "బిహార్ ప్రజలు ఎన్డీయేకు 202 మంది ఎమ్మెల్యేలను ఇచ్చారు. ఆ బాధ్యతను నాయకత్వం సరిగ్గా వినియోగించాలి. నేర చరిత్ర ఉన్నవారికి కాకుండా, నిజాయితీగా పనిచేసే వ్యక్తికి నాయకత్వం ఇవ్వాలి" అని ప్రశాంత్ కిశోర్ వ్యాఖ్యానించారు. బిహార్‌లో విద్యా వ్యవస్థ మెరుగుపడాలని, యువతకు ఉద్యోగ అవకాశాలు పెరగాలని, ఇతర రాష్ట్రాలకు వలస వెళ్లాల్సిన పరిస్థితి తగ్గాలని ఆయన అన్నారు. గుజరాత్ అభివృద్ధిపై ఎంత శ్రద్ధ చూపుతున్నారో, 13 కోట్ల జనాభా ఉన్న బిహార్‌పైనా అంతే శ్రద్ధ చూపాలని కేంద్రాన్ని కోరారు. "బిహార్ పిల్లలు రూ.10-15 వేల జీతాల కోసం కుటుంబాలను వదిలి గుజరాత్, ముంబై, ఢిల్లీ, బెంగళూరు వంటి ప్రాంతాలకు వెళ్లాల్సిన పరిస్థితి మారాలి" అని ఆయన అన్నారు. కులం, మతం, ఉచిత రేషన్ అంశాలకే పరిమితం కాకుండా విద్య, ఉపాధి, అభివృద్ధి ఆధారంగా రాజకీయాలు సాగాలని ప్రశాంత్ కిశోర్ పేర్కొన్నారు. "30 ఏళ్లుగా ఉన్న రాజకీయ కోట కేవలం 20 రోజుల్లో కదిలింది. ప్రజలు మార్పు కోరుకుంటున్నారనే సంకేతం ఇది" అని అన్నారు. బిహార్ భవిష్యత్తు కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక ప్రణాళికలు రూపొందించాలని ఆయన డిమాండ్ చేశారు.

# రెండేళ్లలో భారీ అప్పులు...రూ.1.69 లక్షల కోట్లు



**న్యూస్ డెస్క్, 03 ఆగస్టు (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్ అప్పుల పై కేంద్ర ఆర్థిక శాఖ సహాయ మంత్రి పంకజ్ చౌదరి పార్లమెంట్ లో స్పష్టత ఇచ్చారు. గత రెండేళ్ల కాలంలో (2024-25, 2025-26) ఏపీ ప్రభుత్వం మొత్తం రూ. 1,69,341 కోట్ల మేర అప్పులు చేసిందని వెల్లడించారు. ఇందులో 2024-25 ఆర్థిక సంవత్సరంలో రూ. 82,855 కోట్లు రుణాలు తీసుకోగా, 2025-26 ఆర్థిక సంవత్సరంలో రూ. 86,486 కోట్లను అప్పుగా సేకరించినట్లు ఆయన రాతపూర్వక సమాధానంలో ఆయన పేర్కొన్నారు. రాష్ట్రం చేసిన రుణాల్లో మెజారిటీ భాగం ఓపెన్ మార్కెట్ ల్యాండింగ్స్ ద్వారానే జరిగినట్లు కేంద్రమంత్రి తెలిపారు. 2024-25లో రూ. 78,205 కోట్లు, 2025-26లో రూ. 82,272 కోట్లను బహిరంగ మార్కెట్ నుంచే సేకరించారని వెల్లడించారు. వీటితో పాటు వివిధ బ్యాంకుల నుంచి రూ. 900 కోట్లతో పాటు, 2025-26లో మరో రూ. 1,633 కోట్ల మేర రుణాలను ఏపీ ప్రభుత్వం సేకరించిందని సమాధానంలో వివరించారు.

పూర్తిగా ప్రభుత్వాల బాధ్యతే..

అప్పుల సమీకరణ, ఆర్థిక లోటును అదుపులో ఉంచుకోవడం పూర్తిగా రాష్ట్ర ప్రభుత్వాల బాధ్యతేనని పంకజ్ చౌదరి స్పష్టం చేసింది. ఎఫ్ఆర్‌బీఎం నిబంధనలకు అనుగుణంగానే రాష్ట్రాల రుణ పరిమితులు నిర్దేశించబడతాయని స్పష్టం చేశారు. ఆర్థిక క్రమశిక్షణ పాటించాల్సిన అవసరం ఉందన్నారు. రాజ్యసభలో సభ్యులు అడిగిన ప్రశ్నలకు కేంద్ర మంత్రి పంకజ్ చౌదరి ఈ వివరాలను వెల్లడించారు.

# అసెంబ్లీకి కొత్త రూపు



**న్యూస్ డెస్క్, 03 ఆగస్టు (తెలుగు గళం):** అసెంబ్లీ భవనంలో మరిన్ని వసతులు, సౌకర్యాలు కల్పించేందుకు మాస్టర్ ప్లాన్‌ను రూపొందిస్తున్నారు. అసెంబ్లీ భవన విస్తరణపై మాస్టర్ ప్లాన్ తయారు చేసే పనిలో అధికారులు నిమగ్నమయ్యారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ పార్టీలకు అనువుగా నిర్మాణాన్ని చేపట్టాలని నిర్ణయించారు. కొద్ది కాలం క్రితం అసెంబ్లీ, శాసనమండలి ఒకే ప్రాంగణం నుంచి కార్యకలాపాలు ప్రారంభమయ్యాయి. దీంతో స్పీకర్, చైర్మన్, మంత్రులు, చీఫ్ విప్‌లు, విప్‌లకు చాంబర్లకు ఇబ్బందిగా మారింది. మంత్రుల చాంబర్లు ఇరుకుగా ఉన్నాయని, వీటిని మరికొంత విస్తరించాలని నిర్ణయించారు. దీంతో అదనపు చాంబర్లు అవసరం అవుతాయని గుర్తించారు. ఈ నేపథ్యంలో ప్రస్తుతమున్న అసెంబ్లీ భవనం పైన రెండు ఫ్లోర్లను నిర్మించాలని ఆలోచన చేస్తున్నారు.

భవనానికి సామర్థ్య పరీక్షలు..

అయితే ఇప్పుడున్న భవన సామర్థ్యం ఎన్ని ఫ్లోర్లు వేయడానికి అనువుగా ఉందనే విషయాన్ని సాంకేతికంగా పరీక్షలు చేసి నివేదిక ఇవ్వడానికి ప్రైవేటు కన్సల్టెన్సీకి బాధ్యతలు అప్పగించారు. శాసనసభ పక్ష కార్యాలయాల భవనాలు, ప్రింటింగ్ ప్రెస్ గదుల భవనాన్ని మొత్తం తొలగించి పబ్లిక్ గార్డెన్ వైపు మరికొంత స్థలాన్ని సేకరించి భారీ భవనాన్ని నిర్మించాలని ఆలోచన చేస్తున్నారు. ఇందులో శాసనసభ పక్ష కార్యాలయాలు, విప్‌ల చాంబర్లు, అధికారులు ఉండటానికి, వేచి ఉండటానికి, డైనింగ్ హాల్స్‌కు అనువుగా విశాలమైన భవనాన్ని నిర్మించనున్నారు. ఎగ్జిక్యూటివ్, పొలిటికల్ వారికి వేరు వేరుగా ఫ్లోర్లు ఉండేలా చూస్తున్నారు. కానిస్టిట్యూషన్ క్లబ్‌తో పాటుగా అసెంబ్లీ స్పీకర్, డిప్యూటీ స్పీకర్, శాసనమండలి చైర్మన్, డిప్యూటీ చైర్మన్ నివాసగృహాలను నిర్మించాలని నిర్ణయించారు. స్పీకర్‌కు, చైర్మన్‌కు అధికారిక నివాసాలను నిర్మించడం, కానిస్టిట్యూషన్ క్లబ్‌ను అందులో నిర్మించాలని నిర్ణయించారు. విద్యార్థి, ప్రజా, కార్మిక, కర్షకులు, మహిళాలు ఇన్ని వర్గాల సమస్యలపై చర్చించేందుకు, సమావేశాలు, సదస్సులు, సెమినార్లు నిర్వహించేందుకు అనువుగా భవనాన్ని తీర్చిదిద్దనున్నారు.

# హైడ్రా తరహాలో మరో సంస్థ

మొదటి పేజీ తరువాయి



ఈ సందర్భంగా కొన్ని హోటల్స్‌లో తనిఖీలకు వెళ్లిన అధికారులకు పెద్ద ఎత్తున కుళ్లిన మటన్, చికెన్‌ను గుర్తించిన విషయం ప్రస్తావనకు వచ్చింది. అదే సమయంలో కల్తీ నూనెలు, వనస్పతి ఉపయోగిస్తున్నట్టు ఆధారాలు దొరికాయని అధికారులు వివరించారు. దీనితో రెగ్యులర్‌గా హోటల్స్, రెస్టారెంట్స్, పబ్స్, ఫుడ్ కోర్టులను తనిఖీ చేసేందుకు ప్రత్యేకంగా ఓ విభాగం అవసరమని అభిప్రాయానికి సీఎం వచ్చినట్టు తెలిసింది. 'ప్రజలకు అందించే ఆహారం, మందులపై నిరంతరం నిఘా ఉండాలి. అప్పుడు కల్తీ లేని ఆహారం, నాణ్యమైన మందులు ప్రజలకు అందుతాయి. ప్రజారోగ్యంపై పూర్తి స్థాయిలో ఫోకస్ పెట్టేందుకుగా ఓ వింగ్ ఏర్పాటు అవసరం.'అని సీఎం ఆదేశించినట్టు తెలిసింది. దీనితో ప్రస్తుతం మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో విడివిడిగా ఉన్న ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ విభాగాలను ఒకే గొడుకు కిందికి తీసుకురావాలని నిర్ణయం జరిగినట్టు అధికారులు వివరించారు.

రెండు విభాగాల మధ్య కొరవడిన సమన్వయం: మెడికల్ డిపార్ట్‌మెంట్‌లో పనిచేస్తోన్న ఫుడ్ సేఫ్టీ, డ్రగ్స్ కంట్రోల్ విభాగాలు విడివిడిగా పనిచేస్తున్నాయి. కానీ రెండు సంస్థల మధ్య సమన్వయం లేదు. అలాగే రెండు సంస్థలకు ఫీల్డ్‌లో కావాల్సిన స్టాఫ్ లేదు. ఈ విషయాన్ని గుర్తించిన సీఎం రేవంత్ రెడ్డి రెండు విభాగాలను విలీనం చేసి, ఒక కొత్త పేరును సంస్థకు పెట్టాలని అదేశించినట్టు తెలిసింది. దీనితో టీజీ సేఫ్ (Telangana Safety Authority of Food And Essential Drugs) పేరును ఖరారు చేసినట్టు సమాచారం. ఒక ఐజీ ర్యాంకు అధికారికి సంస్థ బాధ్యతలు అప్పగించి, కావాల్సిన స్టాఫ్‌ను పోలీసు శాఖ నుంచి డిప్యూటేషన్ ద్వారా తీసుకోవాలని భావిస్తున్నారు. అయితే రెండు సంస్థల ఏర్పాటు సెంట్రల్ యాక్టు ప్రకారం ఏర్పాటయ్యాయి. విలీనం వల్ల న్యాయపరమైన సమస్యలు తలెత్తకుండా ఉండేందుకు కావాల్సిన జాగ్రత్తలు తీసుకునే పనిలో అధికారులు ఉన్నారు. ఇప్పటికే కొన్ని రాష్ట్రాల్లో ఈ రెండు రకాల పనులను ఒకే సంస్థ నిర్వహిస్తున్నది. అందుకోసం అక్కడి సంస్థల పనితీరు, అక్కడి చట్టాలను పరిశీలించేందుకు ఓ ప్రత్యేక టీమ్ ఆయా రాష్ట్రాల్లో పర్యటిస్తున్నది.

# కల్లూరు ఆర్ఎస్‌లో ఘనంగా ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ జన్మదిన వేడుకలు



**గార్లదిన్నె (తెలుగు గళం న్యూస్) ఆగస్టు 03**

అనంతపురం జిల్లా శింగనమల నియోజకవర్గంలోని గార్లదిన్నె మండలం కల్లూరు ఆర్ఎస్ గ్రామంలో శింగనమల ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ జన్మదిన వేడుకలను అభిమానులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు ఘనంగా నిర్వహించారు.సామల మధు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించిన అనంతరం కేక్ కట్ చేసి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా సామల మధు మాట్లాడుతూ ఎమ్మెల్యే బండారు శ్రావణి శ్రీ ప్రజలకు ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటూ నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఆమె ఆయురారోగ్యాలతో, సుఖసంతోషాలతో మరెన్నో జన్మదిన వేడుకలు జరుపుకోవాలని ఆకాంక్షించారు.అనంతరం నాయకులు, కార్యకర్తలు ఒకరికి ఒకరు కేక్ తినిపించుకుని సంబరాలు నిర్వహించారు.ఈ కార్యక్రమంలో సామల రాజన్న, సామల రామాంజనేయులు, సామల మధు, కే. రామంజి ఆచారి, మజారి నాగేంద్ర, చిట్టి నలపరెడ్డి, కే. ఆంజనేయులు, కృష్ణమూర్తి, పెద్దన్న, తరుణ్ కుమార్ ఆచారి, బెల్లం రామంజి, అరవ పవన్, సాయి ప్రభాస్, లాడెన్ సురేష్, నాగేంద్ర, శర్మ, సీనా, యూత్ కిరణ్, రఘు, ధను, కృష్ణ, అభిషేక్





తదితరులు పాల్గొని ఎమ్మెల్యేకు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

# అరెస్టులపై జగన్ ఆగ్రహం



**న్యూస్ డెస్క్, 03 ఆగస్టు (తెలుగు గళం):** ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో అధికార పార్టీ సాగిస్తున్న రాజకీయ కక్షసాధింపు చర్యలు, పోలీసుల అరాచకాలు ప్రజాస్వామ్యాన్నే హాస్యాస్పదం చేస్తున్నాయని.. అధికార పార్టీ నేతలు దాడులకు పాల్పడితే వారికి రక్షణ కల్పిస్తూ, దాడికి గురైన వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలపైనే అక్రమ కేసులు బనాయించడం ఏ రకమైన న్యాయం? ప్రజాప్రతినిధులు బాధితులకు అండగా నిలబడితే వారిపై కూడా కేసులు పెడుతూ, ప్రశ్నించిన వారి తలుపులు అర్ధరాత్రి బద్దలుకొట్టి అరెస్టులు చేయడం పోలీసు రాజ్యానికి పరాకాష్ట అని వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు.

ఆలూరు బీసీ ఎమ్మెల్యే విరూపాక్షి ఇంటిపై అర్ధరాత్రి 2.45 గంటలకు భారీ పోలీసు బలగాలతో దాడి చేసి, తలుపులు పగలగొట్టి ఆయనను, ఆయన కుమారుడిని అరెస్టు చేసిన తీరు రాష్ట్రంలో చట్టబద్ధ పాలన లేదని స్పష్టం చేస్తోందని జగన్ పేర్కొన్నారు. బాధితుడిని పరామర్శించడానికి వెళ్లిన ఎమ్మెల్యేపై టీడీపీ శ్రేణులు రాళ్లతో దాడి చేస్తే, ఆ దాడి చేసిన వారిని వదిలేసి ఎమ్మెల్యే విరూపాక్షిపైనే హత్యాయత్నం కేసులు పెట్టడం ఘోరమని అన్నారు. ఈ అరాచకానికి సంబంధించిన దృశ్యాలు బయటకు రాకుండా ఇంట్లోని సీసీటీవీ హార్డ్‌డిస్కులను పోలీసులు తీసుకెళ్లడం సాక్ష్యాలను మాయం చేసే ప్రయత్నం కాదా? అని ప్రశ్నించారు.

ఇది ఒక్క ఆలూరుకే పరిమితం కాలేదని ఆయన గుర్తుచేశారు. శ్రీకాకుళంలో ఒక రోడ్డు ప్రమాదాన్ని హత్య కేసుగా మార్చి మాజీ మంత్రి సీదిరి అప్పలరాజును అరెస్టు చేశారని, గుంటూరు ఈస్ట్ మాజీ ఎమ్మెల్యే షేక్ మొహ్మద్ ముస్తఫా వ్యాపార వివాదంలో ఉన్న వ్యక్తిని పోలీసులకు అప్పగిస్తే, ఆయనపైనే కిడ్నాప్ కేసు నమోదు చేశారని ఆరోపించారు. నాయకులు ప్రజల మధ్యకు వెళ్లినా, ప్రభుత్వాన్ని ప్రశ్నించినా కేసులు పెట్టడం ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేయడమేనని అన్నారు.

నేటి 'Gen-Z' తరం డీఎస్సీ అక్రమాలపై సీబీఐ విచారణ, మంత్రి లోకేష్ రాజీనామా, విద్యాదీవెన బకాయిల విడుదల, నిరుద్యోగ భృతి గురించి నిలదీస్తుంటే... సమాధానం చెప్పలేక ప్రభుత్వం ప్రజల దృష్టిని మళ్లించేందుకే ఈ అరెస్టుల డ్రామాలు ఆడుతోందని జగన్ విమర్శించారు. "చంద్రబాబు గారూ... అధికారం, పోలీసు బలం ఎప్పటికీ శాశ్వతం కావు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎన్ని అక్రమ కేసులకైనా, అరెస్టులకైనా భయపడేది లేదు. ప్రజా సమస్యలపై, ప్రభుత్వ అన్యాయాలపై మా పోరాటం తుదివరకు కొనసాగుతుంది" అని వైఎస్ జగన్ స్పష్టం చేశారు.

# ఆకలి తీర్చే 'అమ్మ'.. మానవత్వానికి నిలువెత్తు చిరునామా!

## తెలంగాణ ఉద్యమం నుంచి మానవ సేవ వరకు..మంతెన మణికుమార్ స్ఫూర్తిదాయక ప్రయాణం










**జనగామ (తెలుగు గళం దినపత్రిక) ఆగస్టు 03**

ఒక చిన్న ఆలోచన..సమాజానికి ఏదో ఒక మంచి చేయాలనే తపన..నేడు వేలాది మంది నిరాశ్రయులకు, ఆకలితో అలమటించే అనాథలకు ఆశాకిరణంగా మారింది. తెలంగాణ ఉద్యమంలో స్వరాష్ట్ర సాధన కోసం పోరాడిన ఓ ఉద్యమ నాయకుడు..అదే ఉద్యమ స్ఫూర్తిని నేడు మానవ సేవగా మలుచుకుని సమాజానికి అండగా నిలుస్తున్నారు.తెలంగాణ మలిదశ ఉద్యమం, అనంతరం జనగామ జిల్లా సాధన ఉద్యమంలో చురుకైన పాత్ర పోషించిన మంతెన మణికుమార్, రాష్ట్రం ఏర్పడిన తర్వాత సమాజంలో ఆకలి, పేదరికం, అనాథల సమస్యలే అసలు సవాళ్లు అని భావించి సేవా కార్యక్రమాలకే తన జీవితాన్ని అంకితం చేశారు.తన మిత్రులు వంగ భీమ్‌రాజ్, కొయ్యడ రవి తదితరులతో కలిసి స్థాపించిన 'జనగామ అమ్మ ఫౌండేషన్' గత పదేళ్లుగా ఎలాంటి ప్రచార ఆర్భాటాలకు దూరంగా జనగామ జిల్లా వ్యాప్తంగా వేలాది మంది పేదలు, అనాథలు, నిరాశ్రయులకు అండగా నిలుస్తోంది. ఆకలితో ఉన్న వారికి అన్నం పెట్టడం నుంచి బంధువులు లేని అనాథలకు అంతిమ సంస్కారాలు నిర్వహించే వరకు మానవత్వానికి అద్దం పట్టే సేవా కార్యక్రమాలను నిరంతరం కొనసాగిస్తోంది.

### ఉద్యమ నాయకుడి నుంచి సేవా మార్గం వైపు

తెలంగాణ ఉద్యమంలో మంతెన మణికుమార్ విద్యార్థులు, యువతతో కలిసి ర్యాలీలు, ధర్నాలు, నిరసన కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం జనగామను ప్రత్యేక జిల్లాగా ప్రకటించాలనే ఉద్యమంలోనూ ముందుండి పోరాడారు. రాష్ట్రం, జిల్లా సాధించిన తర్వాత ఉద్యమ లక్ష్యం నెరవేరినా సమాజంలో ఆకలి, నిరుపేదరికం, నిరాశ్రయుల సమస్యలు అలాగే ఉండటాన్ని గమనించిన ఆయన, ప్రజా ఉద్యమానికి నిజమైన కొనసాగింపే సమాజ సేవ అని నమ్మి 'అమ్మ ఫౌండేషన్'కు శ్రీకారం చుట్టారు.

### ఆకలి అలజడి నుంచి పుట్టిన ఆత్మీయత

"వచ్చేటప్పుడు ఏదీ తీసుకురాము..పోయేటప్పుడు ఏదీ తీసుకెళ్లము..మనతో పాటు మరో నలుగురు బతికేలా చేయడమే జీవితానికి అర్థం, పరమార్థం" అనే భావజాలంతో ఫౌండేషన్ సేవా కార్యక్రమాలు కొనసాగుతున్నాయి.రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్, ప్రభుత్వ ఆస్పత్రులు, అండర్‌బ్రిడ్జిలు, పేదవారి గూడేళు వంటి ప్రాంతాల్లో ఆకలితో అలమటించే నిరాశ్రయులు, అనాథలు, వృద్ధులు, రోగులు, వారి బంధువులకు ప్రతి ఆదివారం మాత్రమే కాకుండా అవసరమైన ప్రతి సందర్భంలో ఉచిత భోజనం, అల్పాహారం, పండ్లు, పాలు అందిస్తున్నారు. వేలాది మంది ఆకలి తీర్చడమే తమ లక్ష్యమని ఫౌండేషన్ సభ్యులు చెబుతున్నారు.

### రూ.5లకే భోజనం..ఫౌండేషన్ కల

హైదరాబాద్‌లో అమలవుతున్న తరహాలో జనగామ పట్టణంలో కూడా రూ.5లకే భోజనం అందించే క్యాంటీన్ ఏర్పాటు చేయాలని జిల్లా కలెక్టర్, మున్సిపల్ అధికారులు, ప్రజాప్రతినిధులను ఫౌండేషన్ పలుమార్లు కోరింది. ఆర్థికంగా వెనుకబడిన వారు, రోగుల సహాయకులు, వృద్ధులు, కూలీలు ఆకలితో ఇబ్బంది పడకుండా ఉండేందుకు ఈ క్యాంటీన్ ఎంతో ఉపయోగపడుతుందని నిర్వాహకులు భావిస్తున్నారు.

### విద్యాదానం..భవిష్యత్తుకు బాటలు

పేదరికం కారణంగా ఏ చిన్నారి చదువుకు దూరం కాకూడదనే లక్ష్యంతో ఫౌండేషన్ ప్రతి విద్యా సంవత్సరంలో నోట్‌బుక్స్, పెన్నులు, పలకలు, స్కూల్ బ్యాగులు, పరీక్ష ప్యాడ్లు, యూనిఫారాలు, షూస్ పంపిణీ చేస్తోంది.అనాథాశ్రమాలు, ప్రభుత్వ పాఠశాలల్లో చదివే చిన్నారులకు అవసరమైన విద్యా సామగ్రిని అందిస్తూ విద్యాదానాన్ని సామాజిక బాధ్యతగా భావిస్తోంది.

### రక్తదానం..ప్రాణదానం

అత్యవసర పరిస్థితుల్లో రక్తం కోసం ఇబ్బంది పడుతున్న రోగులకు ఫౌండేషన్ సభ్యులు ఎప్పటికప్పుడు స్పందిస్తూ రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నారు.అవసరమైన వారికి రక్తదాతలను సమకూర్చడంతో పాటు ఆస్పత్రులకు తీసుకెళ్లడం, మందులు అందించడం, వైద్య సహాయం అందించడం వంటి సేవలను కూడా చేస్తున్నారు.

### వస్త్రదానం.. 'దయగల గోడ'

చలికాలం, వర్షాకాలాల్లో నిరాశ్రయులకు దుప్పట్లు, దుస్తులు పంపిణీ చేస్తున్నారు. జనగామ మున్సిపల్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన 'వాల్ ఆఫ్ ఫ్రెండ్‌షిప్' ద్వారా ప్రజలు అందించిన పాత దుస్తులను సేకరించి అవసరమైన వారికి పంపిణీ చేస్తున్నారు.ఉపయోగంలో ఉన్న బట్టలను పారేయకుండా అవసరమైన వారికి అందించాలనే మంచి ఆలోచనకు ప్రజల నుంచి విశేష స్పందన లభిస్తోంది.

### అనాథలకు గౌరవప్రదమైన అంతిమ సంస్కారాలు

బంధువులు లేక మరణించిన అనాథ మృతదేహాలను ఎవరూ పట్టించుకోని సందర్భాల్లో ఫౌండేషన్ సభ్యులే ముందుకొచ్చి సొంత ఖర్చులతో అంత్యక్రియలు నిర్వహిస్తున్నారు.మతాచారాలకు అనుగుణంగా గౌరవప్రదంగా అంతిమ సంస్కారాలు నిర్వహించడం ద్వారా మానవత్వానికి నిలువెత్తు నిదర్శనంగా నిలుస్తున్నారు.

### పర్యావరణ పరిరక్షణలోనూ ముందంజ

'బర్త్‌డే ట్రీ' కార్యక్రమం ద్వారా పుట్టినరోజులు, శుభకార్యాల సందర్భంగా మొక్కలు నాటి వాటి సంరక్షణ బాధ్యతలను కూడా తీసుకుంటున్నారు.వేసవిలో చలివేంద్రాలు ఏర్పాటు చేయడం, ప్రమాదకర రోడ్డు గుంతలను శ్రమదానం చేసి పూడ్చివేయడం, తప్పిపోయిన చిన్నారులను గుర్తించి వారి కుటుంబాలకు చేర్చడం వంటి సామాజిక బాధ్యతలను కూడా నిర్వర్తిస్తున్నారు.

### కరోనా సమయంలో ప్రాణాలను సైతం లెక్కచేయని సేవ

కరోనా మహమ్మారి సమయంలో లాక్‌డౌన్ కారణంగా ఇబ్బందులు పడుతున్న వలస కార్మికులు, నిరాశ్రయులు, నిరుపేద కుటుంబాలకు నిత్యం భోజనం, నిత్యావసర సరుకులు, మాస్కులు, శానిటైజర్లు పంపిణీ చేశారు. కరోనా కారణంగా మరణించిన నిరుపేదలకు బంధువులు లేకపోయినా వారి భౌతిక కాయాలకు గౌరవప్రదంగా దహన సంస్కారాలు నిర్వహించి మానవత్వాన్ని చాటారు.

**ఫౌండేషన్ నిర్వాహకులు**

- వ్యవస్థాపక అధ్యక్షుడు: మంతెన మణికుమార్
- ప్రధాన కార్యదర్శి: వంగ భీమ్‌రాజ్
- వైస్ ప్రెసిడెంట్: కొయ్యడ రవి
- ముఖ్య సభ్యులు: ఎండీ రఫీ, ఎస్కే కరీమ్, తుంగ కౌశిక్, నల్ల మహేష్, పిల్లల నరేష్, చింతకింది సురేష్, కుంబాలపల్లి హరీష్‌రెడ్డి, లింగ నిరంజనచారి, తుంగ నవీన్ తదితరులు.

### వేడుకల్లో సేవా సంస్కృతి

పుట్టినరోజులు, వివాహ వార్షికోత్సవాలు, శుభకార్యాలను ఆర్భాటంగా కాకుండా అనాథలకు అన్నదానం, పండ్ల పంపిణీ, దుస్తుల పంపిణీ వంటి సేవా కార్యక్రమాలుగా నిర్వహించాలని ఫౌండేషన్ పిలుపునిచ్చింది. ఈ పిలుపుతో అనేక కుటుంబాలు తమ ప్రత్యేక రోజులను సేవా దినాలుగా మార్చుకుంటున్నాయి.

### భవిష్యత్ లక్ష్యాలు

సేవలను మరింత విస్తరించేందుకు ఫౌండేషన్ త్వరలో 'అమ్మ ఫుడ్ బ్యాంక్', 'నైట్ షెల్టర్ హోమ్', 'అమ్మబడి', 'దయగల గోడ' విస్తరణ వంటి బృహత్తర కార్యక్రమాలను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తోంది. ఆకలితో ఎవరూ అలమటించని సమాజమే తమ అంతిమ లక్ష్యమని నిర్వాహకులు చెబుతున్నారు.ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షుడు మంతెన మణికుమార్ మాట్లాడుతూ, "నాడు తెలంగాణ ఉద్యమంలో, జనగామ జిల్లా సాధనలో ఏ ఆశయంతో అయితే పోరాడామో..అదే ఉద్యమ స్ఫూర్తితో నేడు ఆకలి లేని సమాజం కోసం, నిరుపేదల సంక్షేమం కోసం సేవ చేస్తున్నాం. ఆకలి తీర్చడంలోనే నిజమైన సంతృప్తి ఉంటుంది. ప్రతి ఒక్కరూ తమ పుట్టినరోజులు, పెళ్లిరోజుల సందర్భాల్లో ఆర్భాటాలకు దూరంగా ఉండి అనాథలకు, నిరుపేదలకు సహాయం చేయడం ద్వారా సమాజ సేవలో భాగస్వాములు కావాలి" అని పిలుపునిచ్చారు.సేవా కార్యక్రమాల్లో భాగస్వాములు కావాలనుకునే వారు లేదా సహాయం అందించాలనుకునే వారు 99599 22361, 96035 77635 నంబర్లను సంప్రదించవచ్చని ఫౌండేషన్ ప్రతినిధులు తెలిపారు.

# తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర యూత్ వింగ్ కార్యదర్శిగా దేవని శేఖర్ నియామకం

**జనగామ తెలుగు గళం దినపత్రిక ఆగస్టు 03**



తెలంగాణ రాజ్యాధికార పార్టీ రాష్ట్ర యూత్ వింగ్ కార్యదర్శిగా దేవని శేఖర్‌ను రాష్ట్ర యూత్ వింగ్ అధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్ అధికారికంగా నియమించారు. ఈ సందర్భంగా పార్టీ నాయకులు, కార్యకర్తలు, యువజన విభాగం సభ్యులు ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు.ఈ సందర్భంగా దేవని శేఖర్ మాట్లాడుతూ, తనపై నమ్మకం ఉంచి రాష్ట్ర యూత్ వింగ్ కార్యదర్శి బాధ్యతలు అప్పగించిన పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నకు కృతజ్ఞతలు తెలిపారు.అలాగే తన నియామకానికి సహకరించిన రాష్ట్ర యూత్ వింగ్ అధ్యక్షుడు బొడ్డుపల్లి చంద్రశేఖర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.దరాష్ట్రంలో సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణ, బహుజనుల హక్కుల సాధన, యువత అభివృద్ధి కోసం పార్టీ చేపట్టే కార్యక్రమాలను గ్రామ స్థాయి నుంచి రాష్ట్ర స్థాయి వరకు బలోపేతం చేసేందుకు అంకితభావంతో పనిచేస్తానని ఆయన అన్నారు. ప్రతి జిల్లాలో యువతను పార్టీ వైపు ఆకర్షించి బలమైన యువజన శక్తిని నిర్మించేందుకు కృషి చేస్తానని పేర్కొన్నారు.నిరుద్యోగం, విద్య, ఉపాధి, సామాజిక అసమానతలు వంటి యువత సమస్యలపై పార్టీ తరఫున ఉద్యమాలు నిర్వహించి ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లేందుకు కృషి చేస్తానని తెలిపారు.తీన్మార్ మల్లన్న నాయకత్వంలో తెలంగాణ రాజ్యాధికార పార్టీని ప్రత్యామ్నాయ రాజకీయ శక్తిగా మరింత బలోపేతం చేయడానికి రాష్ట్ర యూత్ వింగ్‌తో సమన్వయంగా పనిచేస్తానని చెప్పారు.పార్టీ నాయకత్వం తనపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటూ నిజాయితీ, క్రమశిక్షణ, అంకితభావంతో బాధ్యతలు నిర్వహిస్తానని దేవని శేఖర్ స్పష్టం చేశారు. ఈ సందర్భంగా తనకు శుభాకాంక్షలు తెలిపిన రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, మిత్రులకు ఆయన కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ రాజ్యాధికార పార్టీ బలోపేతానికి ప్రతి కార్యకర్తతో కలిసి ప్రజాక్షేత్రంలో నిరంతరం పనిచేస్తానని పునరుద్ఘాటించారు.

# ఎంపీడీవో మహమ్మద్ హాషంకు ఘన సన్మానం



**జనగామ ఆగస్టు 03 (తెలుగు గళం న్యూస్)**

సూర్యాపేట జిల్లా ఆత్మకూర్ (ఎస్) మండల ఎంపీడీవోగా విధులు నిర్వహించి పదవీ విరమణ పొందిన జనాబ్ మహమ్మద్ హాషం సాహెబ్‌ను జనగామలోని ఆయన నివాసంలో కలిసి ఘనంగా సన్మానించి అభినందనలు తెలిపారు.ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, నాలుగు దశాబ్దాల పాటు ప్రభుత్వ సేవలో అంకితభావంతో, నిజాయితీగా, బాధ్యతాయుతంగా విధులు నిర్వహించి ప్రజల అభిమానం పొందిన మహమ్మద్ హాషం సేవలు ఆదర్శప్రాయమని కొనియాడారు. ఆయన సేవా ప్రస్థానం భావితరాలకు స్ఫూర్తిదాయకంగా నిలుస్తుందని పేర్కొన్నారు.పదవీ విరమణ అనంతరం కూడా ఆయన సంపూర్ణ ఆరోగ్యం, ఆనందం, ప్రశాంతతతో కుటుంబ సభ్యులతో కలిసి దీర్ఘాయుష్షుతో జీవించాలని అల్లాహ్‌ను ప్రార్థిస్తూ, ప్రభుత్వానికి అందించిన విశిష్ట సేవలకు కృతజ్ఞతలు తెలిపారు.ఈ కార్యక్రమంలో మహమ్మద్ అంకుషావలి, మహమ్మద్ తహ్సీన్, మహమ్మద్ అఫ్జల్, మహమ్మద్ ఖలీల్ అహ్మద్ తదితరులు పాల్గొని మహమ్మద్ హాషం సాహెబ్‌కు శాలువాతో సన్మానం చేసి శుభాకాంక్షలు తెలిపారు.

# బీరాపల్లి లో ఘనంగా తల్లి పాల వారోత్సవాలు"

**బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలి: ఇజ్జిగాని గంగాజలం(బీరాపల్లి సెక్టార్ సూపర్ వైజర్)**

**ప్రభుత్వ ఆసుపత్రులకు రండి" సుఖ ప్రసవాలకు దగ్గర కండి: ఉదయ్(పల్లె దవాఖాన వైద్యులు)**





**సత్తుపల్లి/వేంసూరు,ఆగస్టు03(తెలుగు గళం) న్యూస్:**

సత్తుపల్లి నియోజకవర్గ పరిధిలోని వేంసూరు మండలశీలోని బీరాపల్లి గ్రామంలో గల రెండు అంగన్వాడీ కేంద్రాలలో సెక్టార్ సూపర్ వైజర్ ఇజ్జిగాని గంగాజలం ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు సోమవారం ఘనంగా జరిగాయి. గ్రామంలో చిన్నారులతో ప్రదర్శన చేశారు. తల్లులకు, అమ్మమ్మలకు, నాయనమ్మలకు తల్లిపాలు, ముర్రుపాలు విశిష్టతపై, పాలు పట్టే విదానంపై గంగాజలం అవగాహన కల్పించారు.పాతపాలు వద్దు తల్లిపాలు ముద్దు అని, బిడ్డ పుట్టిన వెంటనే ముర్రుపాలు పట్టించాలని సూచించారు. తెలిపారు. పిల్లలకు ఆరో నెల నిండిన తర్వాత పాలతో పాటు పెట్టవలసిన ఆహార పదార్థాలను తెలిపారు.చిన్నారుల బరువులు తూకం వేసి ఎత్తులు తీసి వారి యొక్క పోషణా స్థితి, ఎదుగుదల యొక్క వివరాలను గంగాజలం తల్లులకు వివరించారు.కేంద్రాలలో గల స్టాకు వివరాలను,రిజిస్టర్ లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు.పల్లె దవాఖాన వైద్యులు ఉదయ్ పాల్గొని గర్భిణీ స్త్రీలు తీసుకోవాల్సిన జాగ్రత్తలు,పరిసరాల పరిశుభ్రత,వ్యక్తిగత శుభ్రత గూర్చి తెలిపారు.మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి రావాలని సిబ్బంది,మందులు,పరికరాలు అందుబాటులో ఉన్నాయని ప్రైవేట్ ఆసుపత్రులకు వెళ్లి ఆపరేషన్ లకు బలి కావద్దని,ప్రభుత్వ ఆసుపత్రులలో సుఖ ప్రసవాలు చేయడం జరుగుతుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో: అంగన్వాడీ టీచర్స్ నందిగామ చంద్ర కళావతి,నాగలక్ష్మి,ఆయాలు వెంకటలక్ష్మి, దేవి,ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులు కవిత,సత్య,జమున, ఏ ఎన్ ఎం ఖమ్మంపాటి మారేశ్వరి,లబ్ధిదారులు,చిన్నారులు పాల్గొన్నారు.

# ఏటూరునాగారం ఏజెన్సీలో గుడుంబా మహమ్మారి

**-- యువ ప్రాణాలను బలితీసుకుంటున్న అక్రమ సారా**

**అక్రమ గుడుంబాపై వెంటనే ఉక్కుపాదం మోపాలి -- ఎక్సైజ్, పోలీసు శాఖలకు ప్రజల విజ్ఞప్తి**

**గుడుంబాతో చిన్నాభిన్నమవుతున్న కుటుంబాలు -- మరో తరం నాశనం కాకముందే కఠిన చర్యలు తీసుకోవాలి**




**తెలుగు గళం ఏటూరునాగారం :**

ములుగు జిల్లా ఏటూరునాగారం మండలంలోని ఏజెన్సీ గ్రామాల్లో అక్రమ గుడుంబా సారా తయారీ, విక్రయాలు రోజురోజుకు పెరుగుతున్నాయని స్థానికులు తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. తక్కువ ధరకు సులభంగా లభిస్తున్న ఈ అక్రమ సారా కారణంగా అనేక మంది యువకులు మద్యానికి బానిసలై ఆరోగ్యాన్ని కోల్పోవడమే కాకుండా, అతి చిన్న వయసులోనే ప్రాణాలు కోల్పోతున్నారని గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రొయ్యూరు, శంకరాజుపల్లి, వీరాపురం, చల్పాక, బన్నాజీబంధం, ముల్లకట్ట రాంపూర్‌తో పాటు ఏటూరునాగారం మండలంలోని పలు ఏజెన్సీ గ్రామాల్లో గుడుంబా విక్రయాలు బహిరంగంగానే జరుగుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు. ఈ అక్రమ వ్యాపారం వల్ల అనేక కుటుంబాలు చిన్నాభిన్నమవుతున్నాయని, చిన్న వయసులోనే మహిళలు భర్తలను కోల్పోయి వితంతువులుగా మారుతున్నారని, చిన్నారులు తండ్రి ప్రేమకు దూరమై తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని వారు వాపోతున్నారు. గుడుంబా కేవలం ఒక అక్రమ మద్యం మాత్రమే కాదు, ఏజెన్సీ సమాజాన్ని క్రమంగా నాశనం చేస్తున్న సామాజిక విపత్తుగా మారిందని స్థానికులు పేర్కొంటున్నారు. యువత భవిష్యత్తు, కుటుంబాల ఆర్థిక పరిస్థితి, గ్రామాల సామాజిక అభివృద్ధిపై దీని తీవ్ర ప్రభావం పడుతోందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ పరిస్థితిపై సంబంధిత ఎక్సైజ్ శాఖ, పోలీసు శాఖలు ప్రత్యేక దృష్టి సారించి, అక్రమ గుడుంబా తయారీ కేంద్రాలను గుర్తించి వెంటనే మూసివేయాలని, సరఫరా వ్యవస్థను పూర్తిగా అరికట్టాలని, ఈ అక్రమ వ్యాపారంలో పాల్గొంటున్న వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని ప్రజలు డిమాండ్ చేస్తున్నారు. అలాగే గుడుంబా నిర్మూలనపై గ్రామాల్లో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, యువతను మద్య వ్యసనం నుంచి దూరంగా ఉంచేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. "గుడుంబాను ఇప్పుడే అరికట్టకపోతే మరో తరం నాశనం అయ్యే ప్రమాదం ఉంది. అధికారులు ఆలస్యం చేయకుండా ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి అక్రమ గుడుంబా తయారీ, విక్రయాలను పూర్తిగా నిర్మూలించాలి. ఏజెన్సీ ప్రాంత ప్రజల ప్రాణాలను కాపాడేందుకు వెంటనే చర్యలు తీసుకోవాలి" అని స్థానికులు విజ్ఞప్తి చేస్తున్నారు.




# దేవాదుల నీటితో పంటలను కాపాడాలి

## రిజర్వాయర్లు నింపి కాలువల ద్వారా చెరువులు, కుంటలకు నీరు విడుదల చేయాలి

## ఎమ్మెల్యే కడియం శ్రీహరికి సీపీఎం వినతిపత్రం



**తెలుగు గళం న్యూస్ స్టేషన్ ఘనపూర్, ఆగస్టు 3**

వర్షాభావ పరిస్థితులతో స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గంలోని రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్న నేపథ్యంలో ప్రభుత్వం అత్యవసరంగా స్పందించి దేవాదుల ప్రాజెక్టు ద్వారా రిజర్వాయర్లను నింపి, కాలువల ద్వారా చెరువులు, కుంటలకు సాగునీటిని విడుదల చేసి పంటలను కాపాడాలని సీపీఎం డిమాండ్ చేసింది. ఈ మేరకు పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, జిల్లా కార్యదర్శివర్గ సభ్యుడు రాపర్తి రాజు ఆధ్వర్యంలో సీపీఎం మండల కమిటీ నాయకులు సోమవారం స్థానిక ఎమ్మెల్యే కడియం శ్రీహరికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాపర్తి రాజు మాట్లాడుతూ, ఈ ఏడాది ఆశించిన స్థాయిలో వర్షాలు కురవకపోవడంతో వేలాది ఎకరాల్లో సాగు చేసిన వరి, పత్తి, మొక్కజొన్న తదితర పంటలు నీటి ఎద్దడితో ఎండిపోయే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఇప్పటికే రైతులు అప్పులు చేసి సాగు చేపట్టారని, ఇప్పుడు పంటలు దెబ్బతింటే తీవ్ర ఆర్థిక సంక్షోభంలోకి నెట్టివేయబడతారని అన్నారు. నియోజకవర్గంలోని రిజర్వాయర్లను దేవాదుల నీటితో వెంటనే నింపి, కాలువల ద్వారా చెరువులు, కుంటలకు నీటిని విడుదల చేయాలని కోరారు. దీంతో పంటలకు సాగునీరు అందడంతో పాటు భూగర్భ జలాలు పెరిగి గ్రామీణ ప్రాంతాల్లో తాగునీటి సమస్య కూడా కొంతవరకు పరిష్కారమవుతుందని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు క్షేత్రస్థాయిలో పంటల పరిస్థితిని పరిశీలించి అవసరమైన చర్యలు చేపట్టాలని, ఒకవేళ పంటలు దెబ్బతింటే వెంటనే నష్టం అంచనా వేసి రైతులకు పూర్తి పరిహారం అందించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతుల కష్టాలను దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వం అత్యవసరంగా నీటి విడుదలపై నిర్ణయం తీసుకునేలా ఎమ్మెల్యే కడియం శ్రీహరి ప్రత్యేక చొరవ తీసుకోవాలని కోరారు. వినతిపత్రానికి స్పందించిన ఎమ్మెల్యే కడియం శ్రీహరి ఘన్‌పూర్ రిజర్వాయర్ నుంచి ఆగస్టు 10లోపు సాగునీటిని విడుదల చేసేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు సీపీఎం నాయకులు తెలిపారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి మునిగెల రమేష్, మండల కమిటీ సభ్యులు కత్తుల రాజు, తోడెంగల ఐలయ్య, రంగరాయగూడెం, ఇప్పగూడెం ఉపసర్పంచ్‌లు మునిగె నరసింహులు, లింగనబోయిన రాజు, చిలుముల్ల భాస్కర్, కత్తుల రాజు (సముద్రాల), పోలాసు పరమేష్, దైద కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఆశ్రమ బాలికల పాఠశాలకు రెగ్యులర్ హెచ్‌ఎం, పీడీని తిరిగి నియమించాలి

## అక్రమ డిప్యూటేషన్లు రద్దు చేయాలని బీఆర్‌ఎస్‌వీ, యూఎస్‌ఎఫ్‌ఐ డిమాండ్




**నర్మెట్ట, ఆగస్టు 3(తెలుగు గళం న్యూస్)**

జనగామ జిల్లా నర్మెట్ట మండలంలోని ప్రభుత్వ గిరిజన ఆశ్రమ బాలికల పాఠశాలకు రెగ్యులర్ హెడ్‌మాస్టర్ (హెచ్‌ఎం), ఫిజికల్ డైరెక్టర్ (పీడీ)లను వెంటనే తిరిగి విధుల్లోకి పంపించాలని బీఆర్‌ఎస్‌వీ జిల్లా నాయకుడు లకావత్ చిరంజీవి, యూఎస్‌ఎఫ్‌ఐ జిల్లా కార్యదర్శి యాకన్న రాథోడ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు జనగామ జిల్లా కలెక్టర్ కార్యాలయంలోని గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. వారు మాట్లాడుతూ, నర్మెట్ట ఆశ్రమ బాలికల పాఠశాలకు నియమితులైన రెగ్యులర్ హెడ్‌మాస్టర్ గత నాలుగేళ్లుగా హనుమకొండలోని గిరిజన శాఖ కార్యాలయం, గిరిజన కోచింగ్ సెంటర్‌లో డిప్యూటేషన్‌పై కొనసాగుతున్నారని ఆరోపించారు. దీంతో పాఠశాలలో ఇన్‌చార్జి హెడ్‌మాస్టర్‌తోనే పరిపాలన కొనసాగుతోందని, ఉపాధ్యాయుల కొరత కారణంగా అన్ని సబ్జెక్టులకు బోధన సక్రమంగా జరగడం లేదన్నారు. అదేవిధంగా పాఠశాలకు చెందిన రెగ్యులర్ ఫిజికల్ డైరెక్టర్ కూడా డిప్యూటేషన్‌లో ఉండటంతో విద్యార్థినులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ప్రాజెక్టు అధికారి డిప్యూటేషన్‌ను రద్దు చేసినప్పటికీ సంబంధిత అధికారి పాఠశాలలో చేరకుండా కోచింగ్ సెంటర్‌లోనే కొనసాగేందుకు ప్రయత్నిస్తున్నారని ఆరోపించారు. ఐటిడీఏ ప్రాజెక్టు అధికారికి తెలియకుండా కోచింగ్ సెంటర్ ప్రిన్సిపాల్ ఒకే రోజున రెండు వేర్వేరు ఉత్తర్వులు జారీ చేశారని, అలాంటి ఉత్తర్వులు జారీ చేసే అధికారం ప్రిన్సిపాల్‌కు లేదని విమర్శించారు. ఒకే రోజున రెండు ఉత్తర్వులు జారీ చేయడం వెనుక ఉన్న కారణాలను వెల్లడించాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో చెలగాటమాడే అక్రమ డిప్యూటేషన్లను వెంటనే రద్దు చేసి, సంబంధిత ప్రిన్సిపాల్, స్పోర్ట్స్ ఆఫీసర్‌ను వారి అసలు పాఠశాలలకు పంపించాలని కోరారు. రెండు రోజుల్లో చర్యలు తీసుకోకపోతే విద్యార్థులతో కలిసి పాఠశాల ఎదుట ఆందోళన చేపడతామని హెచ్చరించారు.

# ఆగస్టు 10న జైల్ భరోను జయప్రదం చేయండి- రాపర్తి రాజు



**తెలుగు గళం న్యూస్ జనగామ రూరల్, ఆగస్టు 3**

కేంద్ర ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఆగస్టు 10న దేశవ్యాప్తంగా నిర్వహించే జైల్ భరో కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్షులు రాపర్తి రాజు పిలుపునిచ్చారు. క్విట్ ఇండియా ఉద్యమ స్ఫూర్తితో కార్మికులు, రైతులు, వ్యవసాయ కూలీలు పెద్దఎత్తున ఉద్యమంలో పాల్గొని తమ హక్కులను కాపాడుకోవాలని ఆయన కోరారు. సోమవారం వడ్లకొండ గ్రామంలో సీఐటీయూ, తెలంగాణ రైతు సంఘం (ఏఐకేఎస్), తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం (ఏఐఏడబ్ల్యూయూ) ఆధ్వర్యంలో నిర్వహించిన జనగామ రూరల్ సదస్సుకు ఏఐఏడబ్ల్యూయూ మండల అధ్యక్షులు బొట్టు సూరయ్య అధ్యక్షత వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన రాపర్తి రాజు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ అనుకూల విధానాలతో రైతులు, కార్మికులు, వ్యవసాయ కూలీల ప్రయోజనాలను దెబ్బతీస్తోందని విమర్శించారు. అమెరికా నుంచి మక్కజొన్న, పత్తి, పాలు, చేపలు తదితర వ్యవసాయ ఉత్పత్తులను జీరో టారిఫ్‌తో దిగుమతి చేసుకునేందుకు కేంద్రం అంగీకరించడం దేశ రైతాంగానికి తీవ్ర నష్టమని అన్నారు. దశాబ్దాల పోరాటాలతో సాధించిన 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్స్ తీసుకురావడం కార్మిక హక్కులపై దాడేనని పేర్కొన్నారు. మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని బలహీనపరుస్తూ కొత్త పథకాలు తీసుకురావడం గ్రామీణ పేదల జీవనోపాధిపై ప్రభావం చూపుతుందని ఆందోళన వ్యక్తం చేశారు. దేశ సంపద, గనులు, అడవులు, విద్యుత్ రంగాన్ని ప్రైవేటీకరణ దిశగా తీసుకెళ్తున్న కేంద్ర ప్రభుత్వ విధానాలను తీవ్రంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా విద్యుత్ ప్రైవేటీకరణ దిశగా అడుగులు వేస్తోందని విమర్శించారు. ఆగస్టు 6న మున్సిపల్ కమిషనర్‌కు వినతిపత్రం సమర్పించి, ఆగస్టు 10న తహసీల్దార్ కార్యాలయం ఎదుట భారీ జైల్ భరో కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సదస్సులో ఏఐఏడబ్ల్యూయూ జిల్లా ఉపాధ్యక్షులు పొత్కనూరి ఉపేందర్, సీఐటీయూ, ఏఐకేఎస్ నాయకులు తాండ్ర ఆనందం, కాస జగన్, బొట్టు శివ, కొప్పుల యాకయ్య, పాలమాకుల నర్సింగారావు, రాములు, సత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

# బీజేపీ కార్యకర్త కుటుంబాన్ని పరామర్శించిన వెంకన్న





**తెలుగు గళం న్యూస్ జఫర్గడ్ ఆగస్టు 03**

జఫర్గడ్ మండలం సాగరం గ్రామానికి చెందిన బీజేపీ కార్యకర్త గబ్బెట విద్యాసాగర్ తండ్రి గబ్బెట సుధాకర్ ఇటీవల మరణించగా, బీజేపీ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు, స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, మాజీ ఎమ్మెల్యే అభ్యర్థి పెరుమాండ్ల వెంకటేశ్వర్లు (వెంకన్న) సోమవారం వారి నివాసానికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా గబ్బెట సుధాకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించిన వెంకన్న, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ ధైర్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా జనగామ జిల్లా ఉపాధ్యక్షులు ఇల్లందుల సారయ్య, బూత్ అధ్యక్షులు గబ్బెట వెంకటయ్య, సీనియర్ నాయకులు మచ్చ బాబు, మచ్చ యాదయ్య, బాశుపాక మల్లేశం, కునూరు గ్రామ బూత్ అధ్యక్షులు సకినాల కొమురెల్లి, బెల్లి పెద్దన్న, తీగారపు బుచ్చయ్య, ముచ్చ యాదవ రెడ్డి, కోమళ్ల గ్రామ బూత్ అధ్యక్షులు వల్లాల శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ ప్రభుత్వం మైనార్టీలకు ఇచ్చిన హామీలు వెంటనే అమలు చేయాలి: బీఆర్‌ఎస్ నాయకులు



**జనగామ ఆగస్టు 03 (తెలుగు గళం న్యూస్)**

ఎన్నికల మేనిఫెస్టోలో ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన హామీలను కాంగ్రెస్ ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని బీఆర్‌ఎస్ జనగామ జిల్లా మైనారిటీ నాయకులు మహమ్మద్ సలీం, మహమ్మద్ యాకుబ్ పాషా డిమాండ్ చేశారు. ఎన్నికల సమయంలో మైనార్టీల ఓట్ల కోసం అనేక హామీలు ఇచ్చి అధికారంలోకి వచ్చిన తర్వాత వాటిని విస్మరించడం బాధాకరమని వారు విమర్శించారు. ముఖ్యంగా మస్జీద్‌లలో సేవలందిస్తున్న ఇమామ్‌లు, మొహజాన్‌లకు గౌరవ వేతనాన్ని పెంచుతామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని గుర్తు చేశారు.

బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయాంలో ఇమామ్‌లు, మొహజాన్‌లకు నెలకు రూ.5,000 గౌరవ వేతనం అందించగా, తాము అధికారంలోకి వచ్చిన వెంటనే అదనంగా రూ.2,500 పెంచి మొత్తం రూ.7,500 చెల్లిస్తామని కాంగ్రెస్ ప్రకటించిందని పేర్కొన్నారు. అయితే అధికారంలోకి వచ్చి ఎంతో కాలమైనప్పటికీ ఆ హామీని అమలు చేయకపోవడం ముస్లిం మైనార్టీలను మోసం చేసినట్టేనని ఆరోపించారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం తన ఎన్నికల హామీని నిలబెట్టుకుని ఇమామ్‌లు, మొహజాన్‌లకు రూ.7,500 గౌరవ వేతనం అమలు చేసి న్యాయం చేయాలని వారు కోరారు. లేనిపక్షంలో ముస్లిం మైనార్టీలకు ఇచ్చిన అన్ని హామీలు అమలు అయ్యే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని మహమ్మద్ సలీం, మహమ్మద్ యాకుబ్ పాషా హెచ్చరించారు.

# ఆన్ మ్యాన్ కార్మికుల సమస్యలు వెంటనే పరిష్కరించాలి

## లేదంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తాం:విద్యుత్ ఉద్యోగుల సంఘం



**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

విద్యుత్ శాఖలో పనిచేస్తున్న ఆన్ మ్యాన్ కార్మికుల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం,విద్యుత్ యాజమాన్యం వెంటనే పరిష్కరించాలని,లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని విద్యుత్ ఉద్యోగుల సంఘం నాయకులు హెచ్చరించారు. భూపాలపల్లిలోని కార్మిక సంఘం జిల్లా కార్యాలయంలో జిల్లా ఉపాధ్యక్షులు రాజేందర్ దేవేందర్ అధ్యక్షతన నిర్వహించిన విస్తృత స్థాయి సమావేశంలో జిల్లా కార్యదర్శి మోత్కూరి కోటి,జిల్లా అధ్యక్షుడు కొసరి భాస్కర్,జిల్లా కోశాధికారి ఎం.డి.అంకుషావలి పాల్గొని ఆన్ మ్యాన్ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలపై సుదీర్ఘంగా చర్చించారు. జిల్లాలోని వివిధ విద్యుత్ విభాగాల నుంచి నాయకులు,సుమారు 50 మంది ఆన్ మ్యాన్ కార్మికులు సమావేశానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ,విద్యుత్ సరఫరా నిరంతరాయంగా కొనసాగేందుకు ఆన్ మ్యాన్ కార్మికులు నిత్యం ప్రాణాలను పణంగా పెట్టి పనిచేస్తున్నారని తెలిపారు. బ్రేక్‌డౌన్‌ల పరిష్కారం,బిల్లుల వసూళ్లు,నిర్వహణ పనులు,అత్యవసర సేవలు తదితర బాధ్యతలను సమర్థవంతంగా నిర్వహిస్తున్నప్పటికీ వారికి కనీస ఉద్యోగ భద్రత,తగిన భద్రతా పరికరాలు,సంక్షేమ సౌకర్యాలు కల్పించకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. విద్యుత్ ప్రమాదాల్లో ప్రాణాలు కోల్పోయిన ఆన్ మ్యాన్ కార్మికుల కుటుంబాల్లో ఒకరికి ఉద్యోగం కల్పించాలని,విధుల్లో ఉన్న ప్రతి కార్మికునికి నాణ్యమైన చేతి తొడుగులు,రక్షణ శిరస్త్రాణాలు,భూమి అనుసంధాన కడ్డీలు తదితర పూర్తి భద్రతా పరికరాలను వెంటనే అందించాలని ప్రభుత్వాన్ని,విద్యుత్ యాజమాన్యాన్ని డిమాండ్ చేశారు. అలాగే ఆన్ మ్యాన్ కార్మికులను వెంటనే సంస్థలో విలీనం చేసి శాశ్వత ఉద్యోగులుగా గుర్తించాలని,సమాన పనికి సమాన వేతనం,ఉద్యోగ భద్రతతో పాటు అన్ని కార్మిక హక్కులను అమలు చేయాలని కోరారు. కార్మికుల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం,విద్యుత్ యాజమాన్యం వెంటనే పరిష్కరించకపోతే రాష్ట్రవ్యాప్తంగా పెద్దఎత్తున ఆందోళనలు,ఉద్యమాలు చేపట్టి పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని నాయకులు స్పష్టం చేశారు. విద్యుత్ వ్యవస్థకు ఆన్ మ్యాన్ కార్మికులే వెన్నెముక అని,వారి సేవలను ప్రభుత్వం గుర్తించి తగిన గౌరవం,హక్కులు కల్పించాలని వారు పిలుపునిచ్చారు.

# ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ ఫోటో ప్రదర్శన పోస్టర్ ఆవిష్కరణ

**తెలుగు గళం న్యూస్ భూపాలపల్లి**

తెలంగాణ సిద్ధాంతకర్త,కాకతీయ విశ్వవిద్యాలయం మాజీ ఉపకులపతి దివంగత ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతిని పురస్కరించుకుని ఏర్పాటు చేస్తున్న ఫోటో ప్రదర్శన ప్రచార పత్రాన్ని (పోస్టర్) హనుమకొండలో సోమవారం ఆవిష్కరించారు. తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్,ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ మానవ వనరుల అభివృద్ధి వేదిక ఉమ్మడి ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం జరిగింది. ఆగస్టు 6వ తేదీన ఉదయం 8 గంటల నుంచి కాకతీయ విశ్వవిద్యాలయంలోని కళాశాల మొదటి అంతస్తులో ప్రొఫెసర్ జయశంకర్ విద్యార్థి దశ నుంచి ప్రత్యేక రాష్ట్ర ఉద్యమ రూపకర్తగా సాగిన జీవిత ప్రస్థానాన్ని ప్రతిబింబించేలా ఈ ఫోటో ప్రదర్శనను నిర్వహించనున్నారు. ఈ సందర్భంగా తెలంగాణ ఉద్యమకారుల ఫోరమ్ జిల్లా కన్వీనర్ పైడిపల్లి రమేష్ మాట్లాడుతూ.. తెలంగాణ సాధన కోసం తన జీవితాన్ని ధారపోసి,ఉద్యమ భావజాలాన్ని దిశానిర్దేశం చేసిన మహనీయుడు ప్రొఫెసర్ జయశంకర్ అని కొనియాడారు. సార్ జీవితంలో అత్యంత అరుదైన,అపురూపమైన దాదాపు 500 చిత్రాలతో ఈ ప్రదర్శనను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ ఫోటో ప్రదర్శనకు జయశంకర్ అభిమానులు,తెలంగాణ ఉద్యమకారులు,మేధావులు,ఉద్యోగులు,విద్యార్థులు,ప్రజాసంఘాల ప్రతినిధులు పెద్ద సంఖ్యలో హాజరై కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మానవ వనరుల అభివృద్ధి వేదిక ప్రతినిధి వేల్పుల రాజు,ఉపాధ్యాయ సంఘాల నాయకులు నక్క తిరుపతి,కొత్తూరి రవీందర్,చల్లూరి సమ్మయ్య,చెరుకు తోట శ్రీరామ్,యాల సురేందర్,చిత్తరంజన్,రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు.



# తెలంగాణ సాహితీ సంఘంలో గీతాకుమారికి స్థానం

**- రెండు దశాబ్దాల సాహిత్య సేవలకు గుర్తింపు.**

**- రాష్ట్ర కార్యవర్గంలో చోటు.**



సత్తుపల్లి, ఆగస్టు 3 (తెలుగుగళం) న్యూస్:

ఖమ్మంజిల్లా సత్తుపల్లికి చెందిన ప్రముఖ కవయిత్రి, రచయిత్రి, విశ్రాంత ఉపాధ్యాయిని బత్తిన గీతాకుమారికి తెలంగాణ తెలుగు భాష సంరక్షణ సంఘం నూతన రాష్ట్ర కార్యవర్గంలో స్థానం లభించింది. గత రెండు దశాబ్దాలుగా తెలంగాణ సాహితీ రంగంలో విశేష సేవలందిస్తున్న ఈ సంస్థ రాష్ట్ర కార్యవర్గాన్ని ప్రకటించగా, గీతాకుమారికి రాష్ట్ర స్థాయి బాధ్యతలు అప్పగించింది. ఈ విషయాన్ని సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి, ప్రధాన కార్యదర్శి బుర్ర మధుసూదన్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. బత్తిన గీతాకుమారి 34 సంవత్సరాల పాటు ఉపాధ్యాయినిగా సేవలందించి ఖమ్మం జిల్లా స్థాయి ఉత్తమ ఉపాధ్యాయిని పురస్కారాన్ని అందుకున్నారు. ఉద్యోగ విరమణ అనంతరం కూడా సాహిత్య సేవను కొనసాగిస్తూ కవయిత్రిగా, రచయిత్రిగా, సమీక్షకురాలిగా, సాహిత్య వేదికల నిర్వాహకురాలిగా విశేష గుర్తింపు పొందారు. వచన కవిత్వం, ఇష్టపదులు, బాలసాహిత్యం, గేయరచన, వ్యాసాలు, కథలు, గజల్‌లు, పలు లఘు సాహిత్య ప్రక్రియల్లో ఆమె రచనలు విశేష ఆదరణ పొందుతున్నాయి. వివిధ పత్రికలు, సాహిత్య వేదికలు, వాట్సాప్ సమూహాల ద్వారా సాహిత్యాభిమానులకు చేరువవుతూ ప్రత్యేక గుర్తింపు సంపాదించారు. సాహిత్య సేవలకు గుర్తింపుగా అనేక జాతీయ, రాష్ట్ర స్థాయి పురస్కారాలు, బిరుదులు అందుకుని సత్తుపల్లి ప్రాంతానికి గౌరవం తీసుకొచ్చారు. రాష్ట్ర కార్యవర్గంలో అవకాశం కల్పించిన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దాస్యం సేనాధిపతి, ప్రధాన కార్యదర్శి బుర్ర మధుసూదన్ రెడ్డికి బత్తిన గీతాకుమారి కృతజ్ఞతలు తెలిపారు. తెలంగాణ తెలుగు భాషాభివృద్ధి, సాహిత్య వికాసం కోసం తన వంతు బాధ్యతలను సమర్థంగా నిర్వర్తిస్తానని ఆమె పేర్కొన్నారు.

Printed and Published by Rayaparthi Bhanuprasad on be half Of Telugu galam
H.No: 1-6, Thammadapally-G, Guduru, PO: Thammadapalli 506316 , Jangoan , Telangana State,
Published at VARSHA PRUDHVI PUBLICATIONS & PRINTER GRAPHICS 3-63, Thanedharpalle, Ghanpur Station Mandal, Thanedharpalle 506143 Warangal ,Telangana State,
Rayaparthi Bhanuprasad TGTEL/25/A4366.